ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శన

మద్యపానం వల్ల కలిగే నష్టాలను కళారూపం ద్వారా తెలియజేస్తున్న కళకరులు

సమాజంలో మద్యం మత్తులో కొందరు మహిళలు, ఆడపిల్లల పట్ల చేస్తున్న హింస, ర్యాగింగ్, దాడులు తదితర అంశాలను తెలియజేసేలా ప్రజానాట్య మండలి కళాకారులు జాతాలో ప్రదర్శన చేశారు. ఇద్దరు మద్యానికి బానిసై తాము తాగుతున్న డబ్బులతోనే ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయన్న భావనను తెలిపేలా దృశ్యాలను ప్రదర్శించారు. తాగిన తరువాత వ్యవహరించే తీరును, ఆడపిల్లలపై దాడి చేసే వైఖరిని కళాకారులు అద్భుతంగా ప్రదర్శించారు. రోడ్డుపై తాగుబోతులు సృష్టించే వీరంగం కళ్లకు కట్టినట్లు మహిళా కళాకారులు ప్రదర్శించి చూపరులను ఆకట్టుకున్నారు.

కెఎస్ఎన్ కళాశాలలో విద్యార్థినులతో సదస్సు

సమాజంలో మహిళలు, ఆడపిల్లలపై జరుగుతున్న హింసను వ్యతిరేకిస్తూ ఐద్వా చేపట్టిన మహిళా పోరుయాత్రలో భాగంగా అనంతపురం కెఎస్ఎన్ బాలికల డిగ్రీ కళాశాలలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడపిల్లలు మహిళల పట్ల సమాజంలో జరుగుతున్న దాడులు, హత్యలు, అత్యాచారాలు, హింస తదితర అంశాలపై ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి మాట్లాడారు. చుట్టూ ఉన్నవారి నుంచి ఎదురవుతున్న ఇబ్బందులపై కుటుంబ సభ్యులు తల్లిదండ్రులతో పంచుకోవాలన్నారు. ధైర్యంగా సమస్యలను ఎదుర్కోవాలని విద్యార్థులకు సూచించారు. అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు.

బిజెపికి జగన్ మద్దతు సిగ్గుచేటు

◆ రాష్ట్రంలో మహిళల రక్షణకు తీసుకున్న చర్యలు తెలపాలి ◆ ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మహిళా రక్షణకు అడుగడుగునా తూట్లు పోడుస్తూ దేశంలో మతతత్వ హింసను ప్రేరేపిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పార్లమెంట్‌లో మద్దతు ఇవ్వడం సిగ్గుచేటని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి విమర్శించారు. సమాజంలో మహిళలపై హింసను వ్యతిరేకిస్తూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో చేపట్టిన మహిళా పోరుయాత్ర బస్సుజాత గురువారం నాడు అనంతపురం జిల్లాలోకి ప్రవేశించింది. జూలై 28వ తేదీన శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో ప్రారంభం అయిన యాత్ర అన్నమయ్య, చిత్తూరు, నెల్లూరు, కడప జిల్లాల మీదుగా అనంతపురం జిల్లా తాడిపత్రిలోకి గురువారం ప్రవేశించింది. అనంతపురం జిల్లాలో తాడిపత్రి, బుక్కరాయ సముద్రం, అనంతపురం, కూడేరు, ఉరవకొండ, గుత్తి, గుంతకల్ ప్రాంతాల్లో జాతా కొనసాగింది. గుంతకల్లు నుంచి కర్నూలు జిల్లాలోకి ప్రవేశించింది. అనంతపురంలోకి ప్రవేశించిన పోరుయాత్ర జాతాకు మున్సిపల్ కార్మికులు, సిఐటియు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. పోరుయాత్రకు నాయకత్వం వహించిన ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి, రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రిలకు ఎర్ర కండువాలు కప్పి, పుష్పగుచ్చాలు స్వాగతం పలికారు. అనంతపురం కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఐద్వా జిల్లా కార్యదర్శి రాజేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన సభలో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి ప్రసంగించారు. ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వ పాలనలో దేశం, రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. మణిపూర్ హింసాకాండ ప్రపంచాన్నే కలిచి వేసిందన్నారు. మహిళల్ని నగ్నంగా ఊరేగించి అత్యాచారం, హత్య చేసిన దుర్ఘటన మానవ సమాజానికే మాయని మచ్చఅన్నారు. మణిపూర్‌లో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఆ రాష్ట్రంలో మారణహోమం జరుగుతున్నా ప్రేక్షకపాత్ర పోషించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి సనాతన ధర్మాన్ని అనుసరించాలని బలవంతంగా సమాజంపై రుద్దుతోందని తెలిపారు. అదే సనాతన ధర్మాన్ని రాష్ట్రంలో అమలు చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దేవాలయాలు, విద్యాలయాలకు ఉత్తర్వులు ఇవ్వడం సిగ్గు చేటన్నారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న హింసను నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏమి చర్యలు తీసుకోనున్నారో చెప్పాలన్నారు. మహిళల్ని నగ్నంగా ఊరేగించి హత్యాకాండకు కారణమైన బిజెపికి జగన్ ప్రభుత్వం మద్దతు ఇవ్వడం దుర్మార్గంగా ఉందన్నారు. సనాతన ధర్మాన్ని దేవాలయాలు, పాఠశాలలో బోధిస్తామని ఉత్తర్వులు ఇవ్వడం సరికాదన్నారు. సనాతన ధర్మవరం అంటే పురుషుడికి స్త్రీ కార్యేసుదాసిగా సేవ చేయాలని బోధిస్తారా..? భర్త చెడ్డవాడైనా సతీసుమతిలా ఉండాలని బోధిస్తారా.? అన్న విషయాలకు రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు సమాధానం చెప్పాలన్నారు. పాఠశాలలో విభిన్న మతాలకు సంబంధించిన విద్యార్థులకు విభిన్న మత ధర్మాలను సనాతన ధర్మాలుగా బోధిస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని మతాల్లో స్త్రీలను పురుషుడికి లోబడి ఉండాలనే చెప్పాయని తెలిపారు. వాటిని తిరస్కరించి మనుస్మృతిని కాదని, భారత రాజ్యాంగ చట్టాన్ని చేసుకున్నామని తెలిపారు. ఈ రాజ్యాంగ చట్టం గురించి ప్రభుత్వం ప్రచారం చేయాలన్నారు. కులం, మతం, లైంగికత, తేడాలు ఉండరాదని బోధించాల్సిన ప్రభుత్వం సనాతన ధర్మాన్ని బోధించాలని చెప్పడం సిగ్గుచేటుగా ఉందన్నారు. సమాజంలో పురుషుడికి మహిళలు లోబడి ఉండాలన్న మనువాదాన్ని, కుల ధర్మమే సనాతన ధర్మమని ప్రచారానికి పూనుకోవడం రాజ్యాంగానికి, భారత చట్టాలకు వ్యతిరేకం అన్నారు. బిల్కిస్ భానుపై అత్యాచారం చేసిన నిందితులను విడుదల చేసిన బిజెపికి వైఎస్ఆర్‌సిపి మద్దతు ఇవ్వడం నేరస్తులకు మద్దతు ఇవ్వడమే అన్నారు. రాష్ట్రంలో కూడా ఆడబిడ్డలకు అండగా ఉంటానన్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బిజెపికి మద్దతిస్తూ తప్పు చేస్తున్నారని తెలిపారు. దిశా బిల్లులో ఇచ్చిన వాగ్దానాల మేరకు 21 రోజుల్లో విచారణ చేస్తామన్న మేరకు ఒక అధ్యయన కమిషన్ వేసి నెల రోజుల్లోపు విధి విధానాలు రూపొందించాలని డిమాండ్ చేశారు. నెల రోజుల్లో సిఫార్సులు స్వీకరించి వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి మాట్లాడుతూ పోరుయాత్రకు మహిళలు హాజరై జయప్రదం కోసం సహకరిస్తుండటం అభినందనీయం అన్నారు. ఇదే స్ఫూర్తితో ఆగస్ట్ 8న విజయవాడలో నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిలదీయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రమాదేవి, సిఐటియు జిల్లా అధ్యక్షురాలు నాగమణి, ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యామల, రాజేశ్వరి, ఉపాధ్యక్షురాలు రామాంజినమ్మ ప్రజానాట్య మండలి క్రిష్ణవేణి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, జిల్లా అధ్యక్షులు ఎటిఎం.నాగరాజు, రాష్ట్ర నాయకురాలు లక్ష్మినరసమ్మ, మంజుల, జ్యోతి, మరియమ్మ, కృపమ్మ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న ఐద్వా నాయకులు

రాయలసీమను రతనాలసీమగా మారుస్తా..!

◆ 'అనంత'లో ప్రతి ఎకరానికీ సాగునీరు
◆ అప్పడే పూర్తి కాకుంటే జాకీ లాగే కియా పోయేది
◆ ఉమ్మడి అనంత పర్యటనలో టిడిపి అధ్యక్షులు చంద్రబాబు

ఆత్మకూరు మండలం సింగనగుట్టపల్లి వద్ద టిడిపి నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

టిడిపి అధికారంలోకి వచ్చాక గోదావరి–కృష్ణా–పెన్నా నదుల అనుసంధానం ద్వారా రాయలసీమను రతనాల సీమగా మారుస్తానని టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు తెలియజేశారు. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల పరిశీలనకు వచ్చిన ఆయన గురువారం నాడు ఉమ్మడి అనంతపురం జిల్లాలో పర్యటించారు. అనంతపురం నగరంలో ఎంవైఆర్ ఫంక్షన్ హాలులో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా రాష్ట్రంలోని సాగునీటి వనరులు, పంపిణీ ఏ రకంగా చేపట్టడం ద్వారా ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి నీరు అందివ్వ వచ్చున్న అంశాలను వివరించారు. ఇందులో గోదావరి–కృష్ణా–పెన్నా నదుల అనుసంధానం గురించి తెలియజేశారు. ఈ నదుల అనుసంధానం ద్వారా రాయలసీమ జిల్లాలకు నేరుగా 280 టిఎంసిల నీరు అందివ్వవచ్చునని వివరించారు. తద్వారా రాయలసీమను రతనాల సీమగా మారుస్తామని తెలిపారు. అనంతపురం జిల్లాకు ప్రతి ఎకరానికీ నీటిని అందిస్తామని హామీనిచ్చారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ తరువాత సాగునీటి ప్రాజెక్టుల సందర్శన యాత్రను ప్రారంభించారు. ఆత్మకూరు మండలంలోని సింగనగుట్టపల్లి వద్ద జరుగుతున్న హంద్రీనీవా పనులను పరిశీలించారు. అనంతపురం పెనుకొండ వద్దనున్న కియా కార్ల పరిశ్రమ వద్ద సెల్ఫీ ఛాలెంజ్ దిగారు. రాత్రికి కదిరి పట్టణానికి చేరుకున్నారు. ఉమ్మడి జిల్లాలో జరిగిన ఈ యాత్ర సందర్భంగా పలుచోట్ల మాట్లాడారు. వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసారని విమర్శించారు. 198 ప్రాజెక్టు పనులను రాష్ట్ర వ్యాప్తంగా ఆపారని తెలిపారు. ఇందులో రాయలసీమకు సంబంధించి 102 ప్రాజెక్టులుండగా అనంతపురం జిల్లాకు సంబంధించి 38 ప్రాజెక్టులు రద్దు చేసినవి ఉన్నాయన్నారు. ఇవి రద్దు చేయడమే కాకుండా మరో ఐదేళ్లు చేపట్టడానికి వీల్లేకుండా జీవోను ఇచ్చారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి అజ్ఞానం, మూర్ఖత్వం కారణంగా రాయలసీమ ప్రాజెక్టుల విధ్వంసం జరిగిందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు ఉంటున్న వైసిపి ఎమ్మెల్యేలు తమ సామ్రాజ్యాలుగా దోచుకుంటున్నారని ఎద్దేవా చేశారు. వీటన్నింటికీ తాము అధికారంలోకి వచ్చాక లెక్కలు చెబుతామని హెచ్చరించారు. టిడిపి హయంలోనే కియా పరిశ్రమ ఉత్పత్తి ప్రారంభం అవకుండా ఉంటే దీన్ని వెళ్లిపోయే విధంగా చేసే వారని ఆరోపించారు. అలా ప్రారంభం కాని జాకీ పరిశ్రమ ఏమైందని ప్రశ్నించారు. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టు పేరుతో పెద్దఎత్తున హడావుడి చేసి ఆ పనులను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కట్టబెట్టి రూ.600 కోట్లు అప్పనంగా దోచిపెట్టాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పది వేల క్యూసెక్కులకు పెంచుతామన్న హంద్రీనీవా కాలువ పనులు ఏమయ్యాయని ప్రశ్నించారు. కేవలం జీవోలకే పరిమితమయ్యాయని దుయ్యబట్టారు. అనంతపురం జిల్లాలోనే బిటిపి, పేరూరు, సామూహిక బిందు సేద్యం పనులన్నీ ఆగిపోయాయని చెప్పారు. భవిష్యత్తులో వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమేనని, తాము అధికారంలోకి వచ్చాక ఈ ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి జిల్లాలోని ప్రతి ఎకరానికి సాగునీటి వసతి కల్పిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, పరిటాల సునీత, కాలవ శ్రీనివాసులు, పల్లె రఘునాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బికె.పార్థసారథి, కందికుంట వెంకటప్రసాద్, ప్రభాకర్‌చౌదరి, జెసి.ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపి జెసి.దివాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనంతలో కియా ప్రపంచం

పెనుకొండ : అనంతపురం జిల్లాలో కియా ప్రపంచాన్ని ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు మెరుగుపర్చామని చంద్రబాబు నాయుడు తెలిపారు. సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరి కార్యక్రమంలో భాగంగా గురువారం సాయంత్రం కియా కార్ల పరిశ్రమను పరిశీలించారు. చంద్రబాబు నాయుడు కియా సందర్శన సందర్భంగా ఆయనకు టిడిపి శ్రేణులు ఘనస్వాగతం పలికారు. క్రైన్‌ల ద్వారా భారీ గజమాలలతో టీడీపీ జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ, కురుబ కష్ణమూర్తిల స్వాగతం పలికారు. చంద్రబాబు కియా వద్ద నిల్చొని 'నేను తెచ్చిన కియా లాంటి ఒక్క పరిశ్రమనైనా తెచ్చే దమ్ముందా'.? జగన్ అని సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భావితరాలకు ఏం కావాలో ఆలోచించడం నా విధానమైతే, విధ్వంసం చేయడమే జగన్ విధానం అన్నారు. కియా పరిశ్రమతో 13వేలమందికి ప్రత్యక్షంగా, 50వేల మందికి పరోక్షంగా ఉపాధి లభించిందని తెలిపారు. తాను కియా పరిశ్రమ తీసుకురావడాన్ని సవాల్‌గా తీసుకుని 6 నెలల్లో పనులు పూర్తిచేసి గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నీళ్లు తీసుకొచ్చామని చెప్పారు. కియా రాకతో అనంతపురం జిల్లా అభివద్ధికి దిక్సూచిగా నిలిచిందన్నారు. కియా పరిశ్రమ అనుబంధ పరిశ్రమలు వచ్చి ఉంటే, ఇక్కడినుంచి బెంగుళూరు వరకు ఇండస్ట్రియల్ హబ్‌గా మారేదన్నారు. వైసిపి నాయకులు ఆదిశగా చర్యలు తీసుకోకుండా ఉన్నవాటినే తరిమేశారన్నారు. వైసిపిలో బట్టలిప్పి సరసాలాడే నీచులంతా ఎంపీలుగా ఉన్నారన్నారు. ఇలాంటి వారిని శాశ్వతంగా ఇంటికి పంపాలన్నారు.



కియా వద్ద ముఖ్యమంత్రి జగన్‌కు సెల్ఫీఛాలెంజ్ విసురుతున్న చంద్రబాబు

'అప్పర్ పెన్నార్' భూనిర్వాసిత రైతులకు న్యాయం చేయండి

ప్రజాశక్తి-కనగానపల్లి

జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పేరూరు అప్పర్ పెన్నార్ ప్రాజెక్ట్‌కు సాగునీరు అందించడం కోసం వ్యవసాయ భూములు కోల్పోయిన తమకు నష్ట పరిహారం ఇప్పించాలని కోరుతూ గురువారం టిడిపి అధినేత చంద్రబాబుకు రైతులు వేపకుంట ప్రభాకర్, టి.సుధాకర్, ఈశ్వరరెడ్డి, వేణుగోపాల్, తదితరులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు చంద్రబాబుతో మాట్లాడుతూ టిడిపి హయాంలో జీడిపల్లి నుంచి అప్పర్ పెన్నార్ ప్రాజెక్టు ఎత్తిపోతల పథకం కోసం వివిధ మండలాల్లోని గ్రామాల రైతుల నుంచి 1011.08 ఎకరాల భూమిని సేకరించారన్నారు. అందులో 95.16 ఎకరాలకు రూ. 5.2 కోట్లు రైతుల ఖాతాలోకి జమ చేశారన్నారు. మిగిలిన 915.92 ఎకరాలకు ఆ రోజు నిర్ణయించిన ధర ప్రకారం రూ. 50.75 కోట్లు ఇంకా ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని, అయితే ఈ నాలుగేళ్లలో ఒక్క రుపాయి కూడా చెల్లించలేదని వాపోయారు. పనులు కూడా అసంపూర్తిగా నిలిపి వేశారన్నారు. భూమి నష్టపోయిన తమకు నష్టపరిహారం రాకపోగా ఈ నాలుగున్నరేళ్లలో పంటలు పండించుకోవడానికి దూరం అవడంతో నష్టపోయామన్నారు. కావున ఐదేళ్ల క్రితం నిర్ణయించిన ధర కాకుండా ప్రస్తుత భూముల విలువ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని కోరారు. స్పందించిన చంద్రబాబు భూములు నష్టపోయిన రైతులకు టిడిపి అన్ని విధాలా అండగా ఉండి మీకు న్యాయం చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్, మండల నాయకులు ముకుందనాయుడు, సుధాకర్ చౌదరి, బాల నరసింహులు, సురేష్‌చౌదరి, రైతులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు వినతి పత్రం ఇస్తున్న రైతులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి-రొద్దం

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పేర్కొన్నారు. మండల పరిధిలోని తురకలాపట్నం, పెద్దపల్లి గ్రామాల్లో గురువారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యేతో పాటు ఎమ్మెల్సీ మంగమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అలాగే సంక్షేమ పథకాలు అందాయా లేదా అని ఆరా తీశారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో బాలింతలకు కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రాబర్ట్ విల్సన్, తహశీల్దార్ అనంతాచారి, ఎఒ నివేదిత, విద్యుత్ ఎఇ కృష్ణమూర్తి, వైసిపి మండల కన్వీనర్ తిమ్మయ్య, ఎంపిపి చంద్రశేఖర్, సర్పంచి పరమేష్, రామాంజి, రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కారొరేషన్ డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, అంగన్వాడీ సూపర్‌వైజర్లు అనురాధ, సుజాత, కార్యకర్త త్రివేణి, తదితరులు పాల్గొన్నారు.

బాలింతలకు కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

టిడిపిని ప్రజలు నమ్మరు : ఎమ్మెల్యే తిప్పేస్వామి

ప్రజాశక్తి-మడకశిర

చంద్రబాబు, లోకేష్ పాదయాత్రలు చేసినా, ప్రాజెక్టుల బాట పట్టినా ప్రజలు టిడిపిని నమ్మే స్థితిలో లేరని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. పట్టణంలోని రోడ్లు భవనాల విశ్రాంతి భవనంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తండ్రీ కొడుకులు ఎన్ని పర్యటనలు, యాత్రలు చేసినా టిడిపికి ఒరిగేదేమీ లేదని, వచ్చేది వైసిపి ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు. 2024లో జరిగే ఎన్నికల్లో వైసిపి మెజార్టీ స్థానాలు విజయం సాధించడం ఖాయమన్నారు. నాలుగేళ్లలో నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, వాటిని చూసి ప్రజలు మళ్లీ వైసిపికి పట్టం కడతారని గుర్తుచేశారు. టిడిపి హయాంలో అభివృద్ధి శూన్యమని ప్రజలు తిరగబడుతున్నారన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు కన్వీనర్ రామిరెడ్డి, ఒక్కలిగ సంఘం డైరెక్టర్ నాగరాజు గౌడ్, జయరాజు, శివన్న, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

రోడ్డు సౌకర్యం కల్పించాలి

మడకశిర : రోడ్లు, వీధి దీపాలు ఏర్పాటుచేయాలని డిమాండ్ చేస్తూ గురువారం పట్టణంలోని చౌటుపల్లి వద్ద కాలనీ మహిళలు నిరసన కార్యక్రమం చేపట్టగా సిపిఐ తాలూకా ఇన్‌ఛార్జి పవిత్ర, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా పవిత్ర మాట్లాడుతూ కాలనీలో సమస్యలు పరిష్కరించకపోతే మున్సిపల్ కార్యాలయాన్ని, ప్రజాప్రతినిధుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు.

తల్లిపాలే బిడ్డకు రక్ష

ప్రజాశక్తి-గుడిబండ

తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష లాంటిదని గుడిబండ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ పద్మావతి పేర్కొన్నారు. మండల పరిధిలోని చిగతుర్పి, మైనగానపల్లి, సిసి గిరి, తదితర గ్రామాల్లోని అంగన్వాడీ సెంటర్లలో గురువారం తల్లిపాల వారోత్సవం తో పాటు, ప్రభుత్వం గర్భిణులు, బాలింతల కోసం నూతనంగా ప్రవేశపెట్టిన టేక్ హోం ద్వారా ఇంటి వద్దకే పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ గర్భిణులు, బాలింతలకు వైఎస్ఆర్ కిట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులకు అంగన్వాడీ సెంటర్లలో పౌష్టికాహారం అందించే వారని, ఇకపై టేక్ హోం ద్వారా బియ్యం, మంచినూనె, పాలు, బేడలు, కోడిగుడ్లు, తదితర వస్తువులను పంపిణీ చేస్తారని, ఈ అవకాశాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు, సూపర్‌వైజర్ కమలమ్మ మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రు పాలు తాగించడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. పిల్లలకు రెండేళ్లపాటు తల్లిపాలు మాత్రమే తాగించాలన్నారు. నూనె, చింతపండు, లాంటి పదార్థాలను తినిపించరాదన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచులు హనుమంతరాయప్ప, లక్ష్మీనారాయణ, అంగన్వాడీ కార్యకర్తలు నాగరత్నమ్మ, లక్ష్మీదేవి, రంగమ్మ, దేవీ, రమ్య, సుజాత, మంజునాథ్, వైకె కృష్ణప్ప, మల్లేష్, శివన్న, మల్లేష్, అశోక్, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు,

గుడిబండలో బాలింతలు, గర్భిణులకు కిట్లు పంపిణీ చేస్తున్న సిడిపిఒ పద్మావతి

మడకశిర : మండల పరిధిలోని చందకచర్ల గ్రామంలో తల్లిపాల వారోత్సవాలను అంగన్వాడీ సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులు గా సర్పంచి ప్రభావతి దేవలా నాయక్, సింగిల్‌విండో అధ్యక్షులు రామిరెడ్డి హాజరై తల్లిపాల వల్ల కలిగే లాభాలను గర్భిణులు, బాలింతలకు వివరించారు. అనంతరం గర్భిణులకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బజ్జప్ప, ఎఎన్ఎం జుబేదాబేగం, అంగన్వాడీ టీచర్లు కళావతమ్మ, లక్ష్మి, రాధా, అంగన్వాడీ హెల్పర్ షబానా, ఆశా వర్కర్ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

మడకశిరలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న అధికారులు



పుస్తకావిష్కరణకు శరద్‌పవార్‌ను ఆహ్వానిస్తున్న రఘువీరారెడ్డి

శరద్‌పవార్‌ను కలిసిన రఘువీరారెడ్డి

ప్రజాశక్తి-మడకశిర

మాజీ కేంద్ర మంత్రి శరదపవార్‌ను గురువారం మాజీ మంత్రి ఎన్.రఘువీరారెడ్డి, ఎపిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ఢిల్లీలో కలిశారు. ఈ సందర్భంగా రఘువీరా మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వ్యవసా య రంగానికి చేసిన కృషిపై తాను రాసిన పుస్తకాన్ని సెప్టెంబర్ 2వ తేదీ ఆవిష్కరించడానికి శరద్‌పవార్‌ను ఆహ్వానించినట్లు తెలిపారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వ్యవసాయ రంగానికి ఎన్నో సేవలు అందించారని, కావున తాను పుస్తకాన్ని రచించానని తెలిపారు. ఈ పుస్తకావిష్కరణకు పెద్దలను ఆహ్వానించినట్లు వారు తెలిపారు.

ప్రజల జీవితాలతో చెలగాటం

ఆహార పదార్థాల పాకెట్లను పరిశీలిస్తున్న అధికారిని తస్లీమ్

ప్రజాశక్తి-హిందూపురం

కాదేదీ కల్తీకి అనర్హం అంటూ కల్తీ రాయుళ్లు మనం తినే ఆహార పదార్థాలను యధేచ్ఛగా కల్తీ చేయడమే కాకుండా కాలం చెల్లిన ఆహార పదార్థాలను ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుని తేదీలను మార్చి ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. హిందూపురం కేంద్రంగా కాలం చెల్లిన బ్రాండెండ్ ఆహార పదార్థాల పాకెట్లపై ఏకంగా తేదీలను మార్చి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. పట్టణంలో శ్రీకంఠపురం వద్ద ఒక గోడౌన్‌లో నిర్వహిస్తున్న ఈ తతంగాన్ని కొంత మంది యువకులు బయటకు తీసుకువచ్చి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయడంతో ఆహార భద్రత అధికారులు తనఖీ చేసి, ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకోవడంతో అక్రమ దందా ఒక్క సారిగా బయటపడింది.

కాలం చెల్లిన చిప్స్, బిస్కెట్స్ లాంటి తినుబండారాలను విక్రయిస్తూ పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్న దందాకు హిందూపురం కేంద్రంగా మారింది. కాలం చెల్లిన ప్రముఖ కంపెనీలకు చెందిన చిప్స్, బిస్కెట్స్ ప్యాకెట్లతో పాటు నెయ్యి, ఇతర ఆహార పదార్థాల ప్యాకెట్ల ఉన్న మ్యానిఫ్యాక్చరింగ్ వివరాలను తొలగించి కొత్త తేదీలను ముద్రించి విక్రయించేస్తున్నారు. పురంలో కొన్నాళ్లుగా సాగుతున్న ఈ దందా గుట్టు రట్టయింది. హిందూపురం పట్టణానికి చెందిన వేమనాథ్ అనే వ్యక్తి హిందూపురం పట్టణంలోని శ్రీకంఠపురంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని గోడౌన్‌గా మార్చుకుని ఈ దందాను కొనసాగిస్తున్నాడు.. బెంగళూరు నుంచి కాలం చెల్లిన తినుబండారాలను తీసుకువచ్చి వాటిని తన గోడౌన్లో ఉంచేవాడు. ఆ ప్యాకెట్లపై ఉన్న కాలం చెల్లించిన తేదీలను రసాయనాన్ని ఉపయోగించి చెరిపివేసి కొత్త తేదీలను ముద్రిస్తున్నాడు. వీటిని సిద్ధం చేసుకుని హిందూపురం పరిసర ప్రాంతాల్లో దుకాణాలకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. గోరంట్ల, సోమందేపల్లి, కర్నాటక రాష్ట్రంలోని పావగడలో విక్రయిస్తున్నట్లు సమాచారం. కొన్నేళ్లుగా సాగుతున్న ఈ దందాను అధికారులు పట్టించుకోక పోయిన సామాజిక భాధ్యత కలిగిన యువత ముందుకు వచ్చి గుట్టురట్టు చేశారు.

యథేచ్ఛగా కాలం చెల్లిన ఆహార పదార్థాల విక్రయం

సీజ్ చేసిన అధికారులు

స్పందించిన ఆహార భద్రత ఆధికారిని తస్లీమ్ ఆహార పదార్థాలను పరిశీలించి కాలం చెల్లిన ప్యాకెట్లపై ముద్రించి ఉన్న తేదీలను రసాయనం ద్వారా చెరిపివేసి వాటి స్థానంలో కొత్త తేదీలు ముద్రిస్తున్నట్లు గుర్తించారు. రెండు, ఆరు నెలలు కాలం చెల్లిన ప్యాకెట్లను అధికారులకు లభ్యమయ్యాయి. గోడౌన్లో దాదాపుగా వివిధ కంపెనీలకు చెందిన రూ.45 వేల విలువజేసే బిస్కెట్స్, చిప్స్‌ను గోడౌన్‌తో సహా సీజ్ చేశారు. ఈ వ్యవహారం నడుపుతున్న వేమనాథ్ అనే వ్యక్తిపై 2006 ఆహార భద్రత చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు.

కాలం చెల్లిన ఆహార పదార్థాలు వినియోగిస్తే ప్రమాదం

కాలం చెల్లిన ఆమార పధర్థాలను వినియోగిస్తే చాల ప్రమాదం. ఇప్పటికే జింక్ ఫుడ్ తీసుకోవడం వల్ల చిన్న పిల్లలు రోగాల బారిన పడుతున్నారు. ఇలా కాలం చెల్లిన ఆహార పదార్థాలను వినియోగిస్తే మరింత ప్రమాదం.

ఆఫ్తాబ్,
చిన్న పిల్లల వైద్యులు

కాలం చెల్లిన ఆహార పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు

కాలం చెల్లిన ఆహార పదార్థాలను విక్రయిస్తే ఆహార భద్రత ప్రమాణాల చట్టం కింద వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. హిందూపురం పట్టణంలోని పులమతి రోడ్డులో వేమంత్ గోడౌనులో కాలం చెల్లిన ఆహార పదార్థాలను సీజ్ చేశాం. 2006 ఆహార భద్రత చట్టాన్ని అనుసరించి కేసు నమోదు చేశాం.

తస్లీమ్,
ఆహార భద్రత అధికారిణి

ఫర్టిలైజర్ షాపుల తనిఖీ

నంబుల పూలకుంట : మండల కేంద్రంలోని ఫర్టిలైజర్స్ షాపులను ఎఒ లోకేష్ రెడ్డి గురువారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా దుకాణపు యజమానులకు పలు సూచనలు చేశారు. దుకాణం ముందు మందుల ధరలు వివరాలు పట్టికను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే రైతు మందులు కొనుగోలు చేస్తే వారికి రసీదు ఇవ్వాలన్నారు. అనుమతులేని ఎరువులు, చెల్లుబాటు తేదీ ముగిసిన మందులు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. ఈసందర్భంగా స్టాక్ రిజిస్టర్, బిల్లు పుస్తకాలను పరశీలించారు. దుకాణాల ముందు ఫిర్యాదు నెంబరు ఏర్పాటు చేయాలని ఈసందర్భంగా రైతులు ఎఒను కోరగా తగిన ఏర్పాట్లు తీసుకుంటామని చెప్పారు.

'తోటబడి'తో అధిక దిగుబడులు

బుక్కపట్నం : తోటబడి కార్యక్రమం ద్వారా మామిడి రైతులు అధిక దిగుబడులు పొందవచ్చని జిల్లా అగ్రి అడ్వైజర్ చైర్మన్ రమణారెడ్డి, జిల్లా ఉద్యానవన అధికారి చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని చెంద్రాయిని పల్లిలో మామిడి రైతులకు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో తోటబడి కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తమ భూములను ఖాళీగా ఉంచకుండా ఏదో ఒక పంటను పండిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో లబ్ధి పొందాలని తెలిపారు. జూన్ మాసంలో మామిడికాయ కత్తిరింపు పూర్తి అయిన వెంటనే ప్రతి చెట్టుకు 50 నుంచి నూరు కిలోల పశువుల పేడ, కిలో వేపచెక్క, కిలో సూపర్ ఫాస్పేట్, పొటాషియం ఎరువులు వేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వెంకటరమణయ్య, ఉద్యానవన శాఖ అధికారి నవీన్ కుమార్, సహాయకులు అభినవ కుమార్, అన్నపూర్ణమ్మ ఆశాజ్యోతి రైతులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ సంపూర్ణ పోషణతో ఆరోగ్యం

బుక్కపట్నం : తల్లీ బిడ్డల సంపూర్ణ ఆరోగ్యం కోసమే ప్రభుత్వం వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకాన్ని ప్రవేశపెట్టిందని సర్పంచి నాగలక్ష్మి రాజు, ఎంపీపీ శ్రీధర్ రెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని అంగన్వాడీ సెంటర్‌లో వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీలత గోవర్ధన్ రెడ్డి, సిడిపిఒ గాయత్రి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కౌసల్య, అంగన్వాడీ టీచర్లు నాగమణి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

రామగిరి: మండల కేంద్రంలోని పేరూరులో గర్భిణులకు పౌష్టిక ఆహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు విడుదల

కొత్తచెరువు : సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో ప్రభుత్వం గుర్తించిన సెంటర్లలో పదవ తరగతి ఇంటర్మీడియట్ కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభించారని అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిఇఒ మీనాక్షి కోరారు. ఈ మేరకు జిల్లా డిఇఒ కార్యాలయంలో గురువారం వత్తి విద్య అధికారి లాజర్‌తో కలసి అందుకు సంబందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎసి నాగరాజు, ఎడి రామకృష్ణ, ఎంఇఒ జయచంద్ర తదితరులు పాల్గొన్నారు

జిల్లా అధ్యక్షుడిని కలిసిన చైర్‌పర్సన్

హిందూపురం : హిందూపురం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ వైసిపి జిల్లా అద్యక్షుడు శంకర్ నారాయణను గురువారం పెనుకొండలో ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా హిందూపురం నియోజకవర్గంలో జరుగుతున్న సంఘటనలను వివరించారు. అనంతరం పెనుకొండ బాబాయ్య స్వామి దర్గాను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అయూబ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న చైర్‌పర్సన్

నిర్వాసితులకు పరిహారం ఇప్పించండి

చంద్రబాబును కోరిన జిల్లేడు బండ ప్రాజెక్టు ముంపు రైతులు

ప్రజాశక్తి ముదిగుబ్బ

జిల్లేడు బండ ప్రాజెక్టుకు భూములు కోల్పోయిన రైతులు మాజీ సిఎం చంద్రబాబునాయుడును కలసి తమ సమస్యను విన్నవించారు. జిల్లేడు బండ ప్రాజెక్ట్ తో భూములు కోల్పోతున్న రైతులు పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో మాజీ సీఎం కు వినతి పత్రం అందజేశారు ముదిగుబ్బ మండలం పొడరాళ్ళపల్లి, రామసాగరం, గోపాలపురం, ముదిగుబ్బ, గ్రామాల రైతులు మాట్లాడుతూ 2003వ సంవత్సరంలో అప్పటి తెలుగు దేశం ప్రభుత్వం సాగు భూమి ఎక్కువగా ముంపునకు గురికాకుండా 0.48 టిఎంసిల నిలువతో జిల్లేడు బండ ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతి ఇచ్చిందన్నారు. దీంతో తమకు ఎలాంటి ఇబ్బంది కలుగలేదన్నారు. ఒక ఏడాదికి రెండు నుండి మూడు పంటలు సాగు చేసుకొంటూ జీవించేవారమన్నారు. ఇప్పుడున్న ప్రభుత్వం 0.48 టిఎంసిలు గల జిల్లేడు బండ ప్రాజెక్టును 2.41 టిఎంసిలుగా అనుమతులు జారీ చేసిందన్నారు. దీంతో దాదాపుగా 2వేల ఎకరాల మేర సాగుభూమి ముంపునకు గురవుతుందన్నారు. దీని వలన రైతులు సర్వం కోల్పోతున్నామని అన్నారు. ఇంతేకాకుండా పొడరాళ్ళపల్లికి సమీపంలో కరకట్ట నిర్మాణము చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని దీంతో తమ గ్రామం భవిష్యత్తులో మొత్తం జవుకు ఎత్తుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తమ గ్రామానికి పునరావాసం కల్పించాలని కోరారు. అత్యధికంగా పొడరాళ్ళపల్లి రైతులు భూములు పూర్తి స్థాయిలో కోల్పోతున్నామని ప్రభుత్వం ఇంతవరకు ఎకరాకు నష్ట పరిహారము ఎంత అందిస్తుందో చెప్పలేదని వాపోయారు. ఇంతవరకు గ్రామ సభలు నిర్వహించలేదని, పరిహారం నిర్ణయించలేదని అన్నారు. అయితే సంవత్సరం నుంచి కట్ట పనులు మాత్రం జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం మా గ్రామ భూముల విలువ చాలా ఎక్కువగా ఉందన్నారు. పుట్టపర్తి నేషనల్ హైవేకి అరకిలోమీటరు దూరంలో ఉన్న ఈ భూముల విలువ ఒక ఎకరా రూ. 25 లక్షల నుంచి 30 లక్షల రూపాయల వరకు విలువ ఉందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చి తమకు ఆదుకోవాలని ముంపు బాధిత రైతులు చంద్రబాబునాయుడును కోరారు. ఈ కార్యక్రమంలో ముదిగుబ్బ టౌన్ కన్వీనర్ తుమ్మల మనోహర తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో సాగునీటి రంగం నిర్వీర్యం

మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-మడకశిర

వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో సాగునీటి రంగం పూర్తిగా నిర్వీర్యం అయ్యిందని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో సాగు నీటి ప్రాజెక్టులను సందర్శించాడనికి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడతో కలిసి మాజీ నీటిపారుదల శాఖ మంత్రి దేవినేని ఉమా గురువారం విచ్చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆయన్ను కలిశారు. మడకశిరలో సాగునీటి రంగం పరిస్థితులపై ఆయనతో మాట్లాడారు. మడకశిరకు బైపాస్ కెనాల్ నిర్మాణం, నియోజకవర్గంలో అన్నీ చెరువులకు నీరు, రాళ్లపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి టిడిపి హయాంలో విడుదల చేసిన అనుమతులు తదితర వాటిపై ఆయనతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మడకశిర నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టులకు గ్రహనం పట్టుకుందన్నారు. రాళ్లపల్లి రిజర్వాయర్ కోసం టిడిపి హయాంలో భూసేకరణ చేపట్టినా, వైసిపి దానిని ముందుకు కొనసాగించలేదన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే మడకశిరలో సాగునీటి ప్రాజెక్టు పనులను మరింత వేగవంతం చేయిస్తామని మాజీ మంత్రి దేవినేని ఉమా తిప్పేస్వామికి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి రంగంపై చర్చిస్తున్న నాయకులు

రికార్డు స్థాయిలో ప్రభుత్వ సేవలు

ప్రజాశక్తి, కదిరి టౌన్

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జగనన్న సురక్ష ద్వారా రికార్డు స్థాయిలో ప్రభుత్వ సేవలు లబ్ధిదారులకు అందజేశామని ఎమ్మెల్యే సిద్ధారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమం నియోజకవర్గంలో దిగ్విజయం చేసుకుందన్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కదిరి పట్టణంలో విజయోత్సవ సభ నిర్వహిస్తున్నామన్నారు.కదిరి నియోజకవర్గ వ్యాప్తంగా 93 సచివాలయాల్లో 100516 కుటుంబాలకు సర్వే చేసి 80390 కుటుంబాలకు దాదాపు 93శాతానికి పైగా కుటుంబాలకు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న క్యాస్ట్, ఇన్ కమ్, బర్త్ సర్టిఫికెట్, భూ మ్యూటేషన్ వంటి అనేక సేవలు ఉచితంగా అందించామని చెప్పారు. ఈ కార్యక్రమం ఇంత పెద్ద ఎత్తున జయప్రదం కావడానికి స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, వైసిపి నాయకులు కార్యకర్తల కృషి ఎనలేనిదన్నారు. 40 సంవత్సరాలు రాజకీయం అని చెప్పుకునే చంద్రబాబు నాయుడు కదిరి నియోజకవర్గానికి ఏ మొహం పెట్టుకుని వస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. గతంలో కదిరి నియోజకవర్గానికి ఇచ్చిన హామీలను ఎంతవరకు అమలుపరిచారో చెప్పాలని ప్రశ్నించారు. 2024లో చంద్రబాబుకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నాణ్యతగా నాడు-నేడు పనులు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మనబడి, నాడు నేడు పనులలో ఎలాంటి రాజీ లేకుండా నాణ్యతతో చేపట్టాలని జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లాలో చేపట్టిన నాడు నేడు పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డిఇఒ మీనాక్షి, పిఆర్ ఎస్ఇ గోపాల్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ రషీద్ ఖాన్, వెంకటరమణ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, విద్యాభివృద్ధితోనే ప్రగతి సాధ్యమని అన్నారు. నాడు నేడు పనులలో భాగంగా రక్షిత మంచినీటి కోసం నీటి శుద్ధి యంత్రాలు ఏర్పాటు బాలురు, బాలికలకు వేర్వేరుగా మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం ల్యాబ్‌లు ఏర్పాటు, ఫర్నిచర్ గ్రీన్ బోర్డులు ఏర్పాటు, అదనపు తరగతి గదులు ప్రహరీల నిర్మాణం చేపట్టాలని చెప్పారు. రెండవ దశలో 1081 పాఠశాలలను ఎంపిక చేశామన్నారు. జిల్లాలో వివిధ దశలలో పనులు జరుగుతున్నాయని వచ్చే వారంలోపు పనులలో పురోగతి కనిపించాలని ఆదేశించారు. జిల్లాలో 21 జూనియర్ కళాశాలల్లో రూ. 4 కోట్లతో జరుగుతున్న నాడు నేడు పనులు ఈ నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రంగనాథ్, చిదంబరం, జయచంద్ర, మురళీమోహన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జేసీ చేతన్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దీపిక

జగనన్న సురక్షతో 98శాతం సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి-హిందూపురం

ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 98 శాతం సమస్యలను పరిష్కరించామని వైసిపి నియోజక వర్గ సమన్వయ కర్త, ఇన్‌చార్జి దీపిక అన్నారు. గురువారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నెల రోజుల పాటు విజయవంతంగా కొనసాగిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి పౌరుడి సమస్య పరిష్కారమైందన్నారు. ఈ కార్యక్రమం నిర్వహణకు ప్రభుత్వ ఉన్నత అధికారుల దగ్గరి నుంచి సచివాలయ ఉద్యోగుల వరకు అందరు తమ సేవలను సమర్థవంతంగా నేరవేర్చారన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మేల్యే అబ్దుల్ ఘనీ, మున్సిపల్ వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డి, చిలమత్తూరు ఎంపిపి పురుషోత్తం రెడ్డి, నాయకులు నారాయణ స్వామి, నారాయణ స్వామి, నాగమణి, పెద్ద ఎత్తున వైసిపి నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి కొత్తచెరువు

కొత్తచెరువు లోని కుమ్మర కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలంటూ మహిళలు కాలనీ వద్ద ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహించారు. 15 రోజులుగా పంచాయతీ వారు కుళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేయలేదని ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోలేదని మహిళలు వాపోయారు. నీరు రానందున ట్యాంకర్లకు డబ్బులు కట్టి తెప్పించుకుంటున్నామన్నారు. సత్యసాయి నీరు గాని, చేతిపంపులు గాని లేనందున ట్యాంకర్ ద్వారా సరఫరా చేసుకుంటున్నామని తెలిపారు. పలుమార్లు అధికారులకు తెలిపిన పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కాలనీ మహిళలు కోరారు

ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

నీటికుంటలో పడి డిగ్రీ విద్యార్థి మృతి

మడకశిర : ప్రమాదవశాత్తూ నీటికుంటలో పడి డిగ్రీ విద్యార్థి మృతి చెందిన సంఘటన గురువారం పట్టణ శివారులోని ఎస్‌వైటిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. అమరాపురం మండలంలోని చిట్నడుకు గ్రామానికి చెందిన సంజయ్(23) అమరాపురం ఆర్ఎంసి డిగ్రీ కళాశాలలో బి.కామ్ ఫైనల్ ఇయర్ సెమిస్టర్ చదువుతు న్నాడు. జంబ్లింగ్ పద్ధతి కావ డంతో మడకశిర డిగ్రీ కళాశాలలో పరీక్షకు హాజరుకావాల్సి వచ్చింది. దీంతో ఉదయం తోటి విద్యార్థులతో కలిసి చిట్నడుకు గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై మడకశిర డిగ్రీ కళాశాలకు చేరుకున్నారు. ఇంతలో బహిర్భూమికి వెళ్లి వస్తానని స్నేహితులతో చెప్పి వెళ్లాడు. అయితే పరీక్ష ప్రారంభ సమయం సమీపించడంతో స్నేహితులు కేంద్రంలోకి వెళ్లారు. పరీక్ష ముగిసిన వెంటనే సంజయ్ కోసం చుట్టుపక్కల గాలించగా ఓ నీటి కుంటలో మతదేహాన్ని గుర్తించి కన్నీరు మున్నీరుగా నిలిపించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి మడకశిర ఆస్పత్రికి తరలించారు. అలాగే కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆక్రమణదారుడిపై చర్యలకు డిమాండ్

చిలమత్తూరు : తమ పొలాల వద్దకు వెళ్లే దారితో పాటు మొరసవాండ్లపల్లికి వెళ్లే దారిని ఆక్రమించుకొని కంచె వేసుకోవడంతో ఇబ్బందులు పెడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని దోర్నాల పల్లి, పాలేపల్లి, మొరసవాండ్లపల్లి, కందూరుపర్తి గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం స్థానిక తహశీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ శతాబ్దాలుగా తుమ్మలరెడ్డి దిన్నె నుంచి అనేక బండి దారిలు పొలాలలోకి ఉన్నాయని ఈ దారి నుండి తమ గ్రామాల్లోకి నడక దారులు ఉన్నాయన్నారు. అయితే వీటిని రెడ్డప్ప శెట్టి అనే ఓ రియల్టర్ ఆక్రమించుకున్నాడని విమర్శించారు. తాను కొనుగోలు చేసిన భూమిని సంరక్షించుకుంటున్నాని చెబుతూ కొన్నది కొంతైనా దాని చాటున ప్రభుత్వ స్థలాలు, గుట్టలు, ఏటి పోరంబోకు స్థలాలను ఆక్రమించుకొని చుట్టూ కంచె వేసుకున్నాడని ఆరోపించారు. దీంతో తమ పొలాల్లోకి వెళ్లడానికి దారి లేక పంట సాగు చేయలేక పోతున్నామని వాపోయారు. వెంటనే కంచెను తొలగించి తమకు ప్రభుత్వ రికార్డులలో ఉన్న దారిని చూపాలని, ఆక్రమించుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ప్రభాకర్ రెడ్డి, మరసలపల్లి సర్పంచి భర్త వీరన్న, ఎంపిటిసి రాఘవేంద్ర రెడ్డి, గ్రామస్తులు వెంకటప్ప, నారాయణరెడ్డి, బయప్ప, లక్ష్మయ్య, నంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు, రైతులు

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

ధర్మవరం టౌన్ : అందరి సహకారంతో మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని మున్సిపల్ నూతన వైస్ చైర్‌పర్సన్ షేక్ షంషాద్ బేగం పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె గురువారం తన చాంబర్లో పదవీబాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, అధికారులు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం షంషాద్ బేగం మాట్లాడుతూ మున్సిపాలిటీలోని వార్డులో పర్యటిస్తూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడమే కాకుండా పట్టణ పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ ఆటోలలో తడి, పొడి చెత్తను వేరువేరుగా చేసి వేయాలని ప్రజలకు ఈ సందర్భంగా సూచించారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న వైస్ చైర్‌పర్సన్

రైతులకు అవగాహన

ధర్మవరం టౌన్ : మండల పరిధిలోని పోతుల నాగేపల్లి గ్రామంలో వేరుశనగ పొలంబడి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పంటసాగుపై రైతులకు వ్యవసాయ అధికారి ముస్తఫా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విఎఎలు పూర్ణిమ, చరిత, గ్రామ రైతులు పాల్గొన్నారు.

చంద్రబాబుసభకు తరలిన టిడిపి నాయకులు

పుట్టపర్తి రూరల్: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఓడిసి పర్యటన సందర్భంగా పుట్టపర్తి తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు తరలివెళ్లారు. గురువారం సాయంత్రం కియా ఫ్యాక్టరీ వద్దనుండి నేరుగా గోరంట్ల మీదుగా ఓడిసి చేరుకున్నారు. అక్కడ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టపర్తి మండల కన్వీనర్లు రామాంజనేయులు విజయ్ కుమార్, తెలుగుదేశం నాయకులు రత్నప్ప చౌదరి, వెంకట గారి పల్లి పుల్లప్ప, మాజీ ఎంపీపీ శ్రీరామిరెడ్డి, వెంకట గారి పల్లి సర్పంచ్ ఓబులేసు, పైపల్లి సర్పంచ్ ప్రవీణ్ , కోట్లపల్లి నారాయణస్వామి, పెడపల్లి శ్రీరామ నాయక్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు నాయకులు తరలి వెళ్లారు.

తనకల్లు : కదిరిలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు నిర్వహిస్తున్న ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరి కార్యక్రమానికి వస్తున్న సందర్భంగా మండల పరిధిలోని అన్ని గ్రామాల నుండి టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఈ సందర్భంగా అంబేద్కర్ కూడలిలో బాణాసంచా పేల్చి సుమారు 65 వాహనాలలో తరలి వెళ్లినట్లు మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ శంకర్ నాయుడు, తెలుగు యువత మండలాధ్యక్షుడు కావడి ప్రవీణ్ కుమార్, బ్రహ్మానందరెడ్డి, సోంపాళ్యం నాగభూషణ, పీజీ మల్లికార్జున, వివిధ గ్రామాలకు చెందిన కార్యకర్తలు పాల్గొన్నారు.

బిజెపి విద్వేష రాజకీయాలను ప్రతిఘటిద్దాం

చిలమత్తూరు : మణిపూర్‌లోని మారణకాండను ఖండించాలని బిజెపి విద్వేష రాజకీయాలను ప్రతిఘటించాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. మణిపూర్ ఘటనను నిరసిస్తూ రూపొందించిన కరపత్రాలను మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, కోదూరు గార్మెంట్స్ లో పని చెస్తున్నా మహిళలకు సిపిఎం నాయకులు పంపిణీ చేశారు . ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఫిరంగి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో గత మూడు నెలలుగా సాగుతున్న మారణకాండను మూల కారణమైన బిజెపి విద్వేష రాజకీయాలని ఖండిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వెంకటేష్, లక్ష్మినారాయణ, రామచంద్ర, శేషు, రాకీ, అంజి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

హిందూపురం : ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వైసిపి నియోజక వర్గ సమన్వయ కర్త, ఇన్‌ఛార్జి దీపిక అన్నారు. ఈ మేరకు గురువారం రూరల్ మండలం కొటిపి గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, వైస్ చైర్మన్లు బలరాం రెడ్డి, జబివుల్లా, స్థానిక సర్పంచి ఆదెప్ప, రాష్ట్ర సహాయ కార్యదర్శి హనుమంత రెడ్డి, కొల్లకుంట ఆనంద రెడ్డి, ఎంపీడీవో నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాన్ని అందజేస్తున్న దీపిక

పట్టణ పరిశుభ్రతకు శ్రీకారం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ధర్మవరం పట్టణ పరిశుభ్రతకు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మీ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. గురువారం మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో పట్టణంలో ట్రాక్టర్ల డ్రైవర్లు, యజమానులతో సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం కమిషనర్ బండి శేషన్న, చైర్మన్ కాచర్ల లక్ష్మి మాట్లాడుతూ ఇకనుంచి పట్టణంలోని నూతన బిల్డింగ్, పాత బిల్డింగుల వేస్టులను ఎక్కడపడితే అక్కడ వేసే అవకాశం లేదని, తాము చెప్పిన బండ్లగుంత లేదా ఎల్-2 లోని ఇరిగేషన్ కాలువలో తప్పనిసరిగా వేయాలని తెలిపారు. అందుకోసమే పట్టణంలోని ట్రాక్టర్ల వాహనాలకు నెంబరు గల స్టిక్కర్లు అతికించడం జరిగిందన్నారు. ఈ స్టిక్కర్ గల నెంబరు ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తే తప్పనిసరిగా జరిమానాలతో పాటు వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు. పట్టణ పరిశుభ్రతను సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమ పర్యవేక్షణను టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ బాధ్యత తీసుకుంటారని తెలిపారు. ప్రజలు కూడా పట్టణ పరిశుభ్రతకు సహకరించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఆనంద్, ఇంజనీరింగ్ విభాగం ఈఈ. సత్యనారాయణ టిపిఆర్ఒ సుబ్బరాయుడు, టిపిఒ రవీంద్ర, సచివాలయ ఉద్యోగులు, డాక్టర్ యజమానులు, కార్యాలయ సిబ్బంది శివ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్టిక్కర్లనుచూపుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్, అధికారులు, తదితరులు

కనీస సౌకర్యాలకు నోచని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం

ప్రజాశక్తి - నంబుల పూలకుంట

మండల కేంద్రంలో ఉండే ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి ప్రతిరోజు పేద మధ్యతరగతి కుటుంబానికి చెందినవారు రోగులు వంద నుంచి 150 మంది దాకా వస్తుంటారు. అయితే ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు లేకపోవటంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రిలో తాగడానికి నీరు కూడా లేవని వాపోతున్నారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో రోగులు వైద్యుల కోసం గంటలు తరబడి వేచి చూడాల్సివస్తోందన్నారు. రోగులు అక్కడ కూర్చోవడానికి మౌలిక వసతులు లేవన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి చుట్టూ ఎక్కడ చూసినా పిచ్చి మొక్కలు, చెత్తాచెదరం నిండి ఉందన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం కేటాయించిన నిధులతో నైనా కనీస సౌకర్యాలు కల్పించాలని రోగులు కోరుతున్నారు.

ఆసుపత్రి ఆవరణంలో పెరిగిన పిచ్చిమొక్కలు, నెలకొన్న అపరిశుభ్రత

విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే సతీమణి

ఆలయ నిర్మాణానికి విరాళం

ధర్మవరం టౌన్ : మండల పరిధిలోని ఓబుల నాయన పల్లిలో నూతనంగా చేపట్టిన శ్రీ లక్ష్మీనరసింహ దేవాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే సతీమణి సుప్రియ విరాళం అందజేశారు. గురువారం ఎమ్మెల్యే స్వగృహంలో 50వేల రూపాయల నగదును విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు సుప్రియకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

5న తహశీల్దార్ కార్యాలయాల ముందు నిరసన

పుట్టపర్తి అర్బన్ : ఉపాధ్యాయుల పెండింగ్ వేతనాలు 4 వ తేదీ చెల్లించకుంటే 5 న ఉమ్మడి జిల్లాల్లో తహశీల్దార్ కార్యాలయాల ముందు నిరసనలు ప్రదర్శిస్తామని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులుకోనంకి అశోక్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 5 న నిర్వహించే నిరసన కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రజకుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలు

పుట్టపర్తి అర్బన్ : రజకులు ఐక్యమత్యంగా ఉంటూ సమస్యల పరిష్కారానికి పోరాడాల్సిన అవసరం ఉందని రాష్ట్ర రజక అభివృద్ధి సంస్థ ప్రధాన కార్యదర్శి కమ్మన్న పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సాయి ఆరామం అతిథిగృహంలో జిల్లా రజక అభివృద్ధి సంస్థ జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశానికి కమ్మన్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటిని ఐక్యమత్యంతోనే పరిష్కరించుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ జిల్లా గౌరవ అధ్యక్షుడు శంకర్, ఉపాధ్యక్షులు వెంకటనారాయణ, నాయకులు డాక్టర్ రమణ, శ్రీరాములు, నరసింహులు, లింగార్జున, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు శ్రీకారం

జగనన్న లేఅవుట్‌లో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి కేతిరెడ్డి సుప్రియ, తదితరులు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

కాలుష్యాన్ని నివారించి, పర్యావరణ పరిరక్షణకోసం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పట్టణంలో కొత్తగా ఏర్పాటవుతున్న జగనన్న కాలనీలలో ప్రతి ఇంట్లో ఒక మొక్క విధిగా నాటి సంరక్షించేలా చర్యలు చేపట్టారు. గురువారం పట్టణ పరిధిలోని పోతుల నాగేపల్లి రోడ్డులో ఉన్న జగనన్న లేఅవుట్‌లో ఎమ్మెల్యే కేతిరెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి మొక్కలు నాటి స్ఫూర్తి నింపారు. ఎమ్మెల్యే సతీమణి సుప్రియ, సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డితో కలిసి లబ్దిదారులు, 40 వార్డుల కౌన్సిల్ సభ్యులు, సచివాలయ సిబ్బంది, మున్సిపల్ అధికారులు ఒకే రోజు 4వేల మొక్కలు నాటి రికార్డు సృష్టించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలుష్యాన్ని నివారించాలంటే పచ్చని మొక్కలు నాటి సంరక్షించడం ఒక్కటే మార్గమన్నారు. జగనన్న కాలనీలలో మొక్కలు నాటే కార్యక్రమం పూర్తి కాగానే పట్టణంలో ఉన్న 40వేల ఇళ్లలోనూ ఇవే తరహాలో మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్‌కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్లు షంషాద్ బేగం, వేముల జయరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, ఈఈ సత్యనారాయణ రావు, డీఈలు కృష్ణారావు, వన్నూరు స్వామి, ఏఈలు హరీష్, ప్రతాప్, ఆర్వో ఆనంద్, పట్టణ సచివాలయాల కన్వీనర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్ తో పాటు 40 వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పిస్తాం... వ్యాపారాలు ప్రారంభించండి

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మాణం చేసిన వాణిజ్య సముదాయ భవనంలో వ్యాపారులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తామని, వ్యాపారులు అందరు తమ వ్యాపారాలను ప్రారంభించాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ సూచించారు. గురువారం తన చాంబర్‌లో మున్సిపల్ అధికారులతో కలిసి వాణిజ్య సముదాయ భవన వ్యాపారులు, పూల వ్యాపారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వ్యాపారులు మార్కెట్ భవనం లోపల మిగిలి ఉన్న లైటింగ్ పనులను పూర్తి చేయించాలని కోరారు. మార్కెట్ చుట్టూ మిగిలి ఉన్న తోపుడు బండ్లను తీయించాలని, మార్కెట్ ముందర ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ మరో ప్రాంతానికి మార్చాలని అన్నారు. పూల మార్కెట్ అసోసియేషన్ వారు తమకు పూలు అమ్ముకునేందుకు స్థలం కేటాయించాలని కోరారు. స్పందించిన కమిషనర్ అన్ని సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో కమర్షియల్ మార్కెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నిమ్మకాయల రాము, సెక్రటరీ నాగిరెడ్డి, జాయింట్ సెక్రటరీ వినయ్, పూల మార్కెట్ ప్రెసిడెంట్ కెహెచ్. హిదయతుల్లా, వైస్ ప్రెసిడెంట్ అంజినప్ప, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

మార్కెట్ వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్

వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

తల్లీబిడ్డల ఆరోగ్యానికి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని మున్సిపల్ వైస్ చైర్మన్లు మాసపల్లి సాయికుమార్, చందమూరి నారాయణరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం 9వ వార్డులోని చిన్నూరు అంగన్వాడీ సెంటర్లో వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు, బాలింతలకు సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని అన్నారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లతో ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత అధ్యక్షులు జింక కంబగిరి, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్లు

'పుడా' వైస్ చైర్మన్‌గా ధర్మవరం మున్సిపల్ కమిషనర్

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పుట్టపర్తి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ గా (పుడా వైస్ చైర్మన్) ధర్మవరం మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నను నియమించారు. ఈ మేరకు మున్సిపల్ పరిపాలన పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ బండి శేషన్న పుట్టపర్తిలో బాధ్యతలు స్వీకరించ నున్నారు. ఈసందర్భంగా బండి శేషన్న మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించుటలో తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ధర్మవరం మున్సిపాలిటీ ఉద్యోగులు, సిబ్బంది బండి శేషన్నకు శుభాకాంక్షలు తెలిపారు.